క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీతో స్వకుళ సాలె సంఘం నాయకులు

ఆదోని అర్బన్ : స్థానిక స్వకుళసాలె సంఘం కార్యాలయంలో యువజన సంఘం నూతన కమిటీని సంఘం పెద్దల సమక్షంలో ఆదివారం ఎన్నుకున్నారు. జీవితకాల సభ్యుల సర్వసభ్య సమావేశంలో ప్రస్తుతం ఉన్న యువజన సంఘం కమిటీని రద్దు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా చిందే గోవిందరావు, కార్యదర్శిగా సఫారే నాగరాజు, ఉపాధ్యక్షుడు సాకరే గోపాల్‌తో పాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. సంఘ పెద్దలు మల్లికార్జున, శ్రీనివాస్, తాయప్ప, గణేష్, నాగరాజు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి



విరాళాలు సేకరిస్తున్న ప్రజలు

కోసిగి: ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫ్రెరర్ జయంతిని ఆదివారం నిర్వహించారు. కోసిగి, కౌతాళం, మంత్రాలయం మండలాల్లోని గ్రామాల్లో ప్రజలు ఆర్డీటీ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య, రీజినల్ డైరెక్టర్ రామేశ్వరి ఆధ్వర్యంలో ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సిద్ధాంతం స్పందించు..సహాయం అందించు మేరకు.. నిరుపేదల సహాయార్థం గ్రామాల్లో విరాళాలు సేకరించారు. ఈ సొమ్ముతో అనాథలు, వృద్ధులకు సహాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదోనికి చెందిన బోయ వీరేష్, బోయ అశోక్ 96 కర్ణాటక మద్యం బాటిళ్లను తరలిస్తుండగా ఆదివారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్ ఆదేశించారని మంత్రాలయం పోలీసులు తెలిపారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు

హొళగుంద: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారం సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జలాభిషేకం, మహా మంగళహారతి, సుప్రభాతసేవ, బండరార్చన, కుంకుమార్చనతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక, ఆంధ్రా ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కొందరు భక్తులు మొక్కులో భాగంగా భక్తులకు, అనాథలకు అన్నదానం తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆస్పరి మఠంలో అన్నదానం చేపట్టారు.

నేడు వాహనాల వేలం

ఆలూరు రూరల్: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను సోమవారం మధ్యాహ్నం 1 గంటకు ఆలూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు సీఐ ఈశ్వరయ్య ఆదివారం ప్రకటనలో వెల్లడించారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ సమక్షంలో ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి పోలీసు స్టేషన్లలో సీజ్ చేసిన 85 వాహనాలను వేలం వేయనున్నట్లు ప్రకటించారు. ఇందులో ఒక ఫోర్ వీలర్, మూడు త్రీవీలర్ వాహనాలు, 82 స్కూటర్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.3వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని ఐడీ ప్రూఫ్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

నేటి నుంచి ఉత్సవాలు



శంకరబండలో వెలసిన లింగమేశ్వర స్వామి

ఆస్పరి: మండలంలోని శంకరబండ గ్రామంలో సోమవారం నుంచి లింగమేశ్వర స్వామి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. సోమ, మంగళవారం ఆలయంలో స్వామివారికి గంగ, ఆకు పూజ, అభిషేకం, మంగళహారతులు, బుధవారం స్వామి రథోత్సవం, గురువారం వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరురూరల్: బనవాసి ఏపీ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, 6, 7, 8 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సాజీదాబేగం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 24వ తేదీలోపు https://aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాలన మరింత చేరువ

- వేగంగా గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలు
- 14 కార్యాలయాలు పూర్తి
- 6 రూఫ్ లెవెల్, 15 బేస్ మట్టం స్థాయిలో పనులు
- త్వరలో గ్రామాల్లోని ప్రజలకు అన్ని రకాల సేవలు



బసరకోడులో పూర్తయిన సచివాలయం



రూఫ్ లెవల్‌లో మదిరె సచివాలయ భవనం



బేస్‌మట్టంలో ఉన్న మండగిరి సచివాలయం-02

ఆదోని రూరల్ : గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థతో పాలన ప్రజలకు మరింత చేరువ చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అధికారంలోకి వచ్చిన వెంటనే గాంధీజీ కలలుగన్న స్వరాజ్యస్థాపనలో భాగంగా సచివాలయ వ్యవస్థను రూపకల్ప చేశారు. ఇందులో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో గ్రామ సచివాలయాలకు నూతన భవనాలు నిర్మించేందుకు నిధులు విడుదల చేయడంతో పలుచోట్ల నిర్మాణాలు పూర్తవగా, మరికొన్ని ప్రాంతాల్లో వివిధ దశల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఆయా సచివాలయాల్లో సేవలందించే నిమిత్తం 13 మంది సిబ్బందిని నియమించారు. దీంతో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించాయి.

సెక్రటేరియట్‌ను తలపిస్తున్న గ్రామ సచివాలయాలు..

రాష్ట్ర రాజధానిలో ఉన్న సెక్రటేరియట్‌ను తలపించేలా గ్రామ సచివాలయాలను రూ.40 లక్షలు వెచ్చించి అన్ని హంగులతో నిర్మిస్తున్నారు. ఆదోని మండలంలో మొత్తం 44 గ్రామాలు ఉండగా, 41 పంచాయతీలకు గానూ, 35 సచివాలయాలు ఉన్నాయి. ఈ 35 సచివాలయాల నిర్మాణ పనులను ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో నిర్మిస్తోంది. ప్రస్తుతం 35 సచివాలయాల్లో 14 సచివాలయాల నిర్మాణాలు పూర్తి కాగా, రూఫ్ లెవెల్‌లో- 6, బేస్‌మట్టం లెవెల్‌లో-15 ఉన్నాయి. వీటి పనులు కూడా వేగంగా సాగుతున్నాయి.

ముంగిటే సేవలు..

గతంలో ఏ చిన్న పనికైనా మండల కేంద్రానికి వెళ్లాల్సి ఉండేది. సచివాలయ వ్యవస్థ ఏర్పడటంతో ప్రస్తుతం 544 సేవలు స్థానికంగానే అందుతున్నాయి. అలాగే స్పందన కార్యక్రమంలో సమస్యల పరిష్కారానికి సైతం మండల కేంద్రానికి వెళ్లకుండా ప్రజల నుంచి వినతులు స్వీకరించి వెంటనే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యుత్, మంచినీటి కుళాయి కనెక్షన్, చివరకు తిరుమల దర్శనం టికెట్లు కూడా అందుతున్నాయి. ఆయా పనులకు పనులు మానుకొని మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన వ్యయప్రాసాలు తగ్గడమే కాకుండా ఖర్చులు తగ్గిపోయాయి. కుల, ఆదాయ సర్టిఫికెట్లు, అమ్మ ఒడి, నవరత్నాలు, హౌసింగ్ ఇళ్ల మంజూరు, పింఛన్ దరఖాస్తులు, ఆధార్ నమోదు, ఇంటి గుత్త, భూ సర్వే, ఉపాధి జాబ్‌కార్డు దరఖాస్తు, పంటల నమోదు, విద్యార్థులకు అందుతున్న సంక్షేమంపై ఆరా, గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో మహిళా పోలీసు, ప్రజలు ఆరోగ్యానికి సంబంధించి వైద్యసేవలు అందించేందుకు అందుబాటులో ఏఎన్ఎంను నియమించారు. సచివాలయాల ద్వారా అన్ని సేవలు గ్రామస్థాయిలోనే అందుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భవనాల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి



మండలంలో 35 సచివాలయాల భవనాలకు ప్రభుత్వం నిధులు విడులయ్యాయి. ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు చొప్పున మంజూరయ్యాయి. ఇప్పటివరకు మండలంలో 14 సచివాలయాలు నిర్మాణాలు పూర్తయ్యాయి. బేస్‌మట్టం స్థాయిలో 15 సచివాలయాలు, రూఫ్ లెవెల్‌లో 6 ఉన్నాయి. త్వరలోనే వీటిని కూడా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం పూర్తయిన 15 సచివాలయాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభిస్తాం. ప్రస్తుతం పాత పంచాయతీ కార్యాలయాల్లోనే సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలు అందుతున్నాయి. భవనాలు కూడా పూర్తయితే సచివాలయ సిబ్బందికి, ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

– గీతావాణి, ఎంపీడీఓ

సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాం.. పింఛన్ వచ్చింది



నా భర్త ఈశ్వరప్పకు 79 యేళ్ల వయస్సు. పింఛన్ కోసం గత పదేళ్లుగా మండల కార్యాలయాల చుట్టూ తిరిగాం. గత ప్రభుత్వంలో అధికారులు పట్టించుకోలేదు. మా గ్రామంలో సచివాలయం ఏర్పాటైన తర్వాత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. ఎంపీడీఓ గీతావాణి పరిశీలించి పింఛన్ మంజూరు చేయించింది. –డి.జయమ్మ, పెద్దతుంబళం గ్రామం

సచివాలయంలోనే పనులు అవుతున్నాయి



గతంలో చిన్న పనికి మండల కేంద్రానికి వెళ్లేవాళ్లం. నేడు గ్రామంలోనే సచివాల యం ఏర్పాటు కావడంతో అన్ని పనులు అక్కడే చేస్తున్నారు. భూ సమస్యలు, హౌసింగ్, పింఛన్ తదితర సమస్యలపై సచివాలయాల్లో దరఖాస్తులు అందజేస్తే అధికారులు పరిష్కరిస్తున్నారు. – అయ్యన్న, నాగనాథనహళ్లి గ్రామస్తుడు

సమస్యలు పరిష్కరిస్తున్నారు



సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు గ్రామంలో ఏర్పాటు కావడంతో తాము ఆదోనికి వెళ్లాల్సిన పనిలేదు. స్థానికంగానే మా సమస్యలను అర్జీల రూపంలో సచివాలయంలోని అధికారులకు విన్నవించుకుంటున్నాం. వారు విచారించి సమస్యలను పరిష్కరిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. – గంగాధర్, ధణాపురం గ్రామస్తుడు

సకల సౌకర్యాలతో జగనన్న కాలనీలు



మండిగిరి లే అవుట్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్ : సకల సౌకర్యాలతో జగనన్న కాలనీలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని మండిగిరి లేఅవుట్ జగనన్న కాలనీల్లో పర్యటించారు. కాలనీల్లో నిర్మితమవుతున్న పక్కా ఇళ్లను పరిశీలించారు. పునాది, బేస్‌మెంట్, పూర్తయిన ఇళ్ల పరిశీలించి నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను కోరారు. హౌసింగ్ బోర్డు డీఈ రవికుమార్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షించారు. మండిగిరి లేఅవుట్‌లో మొత్తం 10 వేల మందికి ఇళ్ల పట్టాలను ఇచ్చామని, ఇందులో రూ.5,100 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం బేస్‌మెంట్ లెవెల్, టాప్ లెవెల్ స్థాయిలో 936 ఇళ్ల పనులు జరుగుతున్నాయన్నారు. నెలాఖరి నాటికి 2 వేల ఇళ్లు పూర్తి చేయాలని థర్డ్ పార్టీ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కాలనీలో విస్తారమైన రోడ్లు, విద్యుత్ సరఫరా, తాగునీటి బోర్లు ఏర్పాటు చేశామన్నారు.

40 ఏళ్ల తరువాత కలిశారు



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఆదోని అర్బన్ : వారంతా 40 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్నారు. ఆ తరువాత ఎవరి దారుల్లో వారు వెళ్లిపోయారు. మళ్లీ కలవాలని భావించి ఒక కలవాలని నిర్ణయించుకొని అందరూ ఒక చోట చేరారు. అందుకు పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల వేదికైంది. పట్టణంలోని ఆర్ట్స్ కళాశాలలో 1979–84లో ఇంటర్, డిగ్రీ చదివిన పూర్వపు విద్యార్థులు ఆదివారం కళాశాలలో కలుసుకున్నారు. కళాశాల మొత్తం తిరిగి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, అధ్యాపకులు, సాఫ్ట్‌వేర్ రంగంలో కొందరు, రైతులుగా ఇంకొందరు స్థిరపడిపోయారు. మొత్తం 52 మంది పూర్వపు విద్యార్థులు కలుసుకుని కుశల ప్రశ్నల అనంతరం నాటి అధ్యాపకులను స్మరించుకున్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు, కళాశాల కరస్పాండెంట్ దైవాదీనంరెడ్డి, ప్రిన్సిపాల్ మురళీమోహన్‌రెడ్డి, అధ్యాపకులు రామచంద్రయ్య, అప్పలశాస్త్రి డీఏస్పీలు నరసింగప్ప, రంగయ్య, ఎస్ఐ అలీఖాన్, హెచ్‌ఎంలు ఎల్.కే.చిన్నప్ప, పీఈటీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్పర్‌భద్రతో రాయలసీమకు అన్యాయం



మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఆదోని అర్బన్ : అప్పర్‌భద్ర రూపంలో రాయలసీమకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందని మానవహక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, వక్తలు చంద్రశేఖర్, ఆదినారాయణరెడ్డి, రాజు, నల్లారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మంగళ ఆంజనేయస్వామి ఆలయ మండపంలో మానవహక్కుల వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాయలసీమకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేయడం తగదన్నారు. అప్పర్‌భద్ర ప్రాజెక్టు నుంచి పూర్తిస్థాయిలో జాతీయ హోదా కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం విడ్డూరకరమన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నీటిని కేంద్రాన్ని ఒప్పించి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంపై వెంటనే స్పందించకపోతే సీమకు అన్యాయం తప్పదన్నారు. సమావేశంలో ప్రముఖులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి రూ. లక్ష విరాళం



దాతలకు స్వామి వారి ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి ఆదివారం ఓ భక్తుడు రూ.1,01,700లక్షలను విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజినేయులు తెలిపారు. కర్నూలుకు చెందిన విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులు రూ.1,01,700లను దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి అందజేసినట్లు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును, ఫోటోను అందజేశారు.

జగనన్నే మనందరి భవిష్యత్



33వ వార్డులో వృద్ధురాలికి పథకాలను వివరిస్తున్న దృశ్యం,



ఆదోనిలోని వాల్మీకి నగర్‌లో కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



తుంబిగనూరులో మహిళ అభిప్రాయాలను నమోదు చేస్తున్న దృశ్యం

ఆదోని టౌన్ : మన భవిష్యత్‌ను తీర్చిదిద్దే సామర్థ్యం జగనన్నకు మాత్రమే ఉందని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, 33, 18, 19, 02 వార్డుల కౌన్సిలర్లు సురేష్, చలపతి, లక్ష్మి పేర్కొన్నారు. 'జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం మున్సిపాలిటీ పరిధిలో 1, 2, 18, 19, 28, 29, 31, 33 వార్డుల్లో కార్యక్రమం నిర్వహించారు. ఆయా వార్డుల్లో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, టీడీపీ పాలనతో నేటి పాలనను పోల్చి వివరించారు. బ్యాంకు మల్లి, షరీఫ్, మాజీ కౌన్సిలర్ సుధాకర్, హరికృష్ణ, రాజు, బాబు, సురేంద్ర, రామక్రిష్ణ, రాజు, జైపాల్, వెంకటేష్, మధు, మహేంద్ర, రామాంజనేయులు పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్: మండలంలోని వి.తిమ్మాపురం, 52బసాపురం, మాలపలి,రచ్చుమర్రి, ఖగ్గల్ గ్రామాల్లో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నేతలు జి.భీమిరెడ్డి, విశ్వనాథ్ రెడి, గురురాజరావు, లక్ష్మయ్య, రోగప్ప, ఖగ్గల్ గ్రామంలో భీమ యూత్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు– నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ తిరిగి అభిప్రాయాలు సేకరించారు.

కోసిగి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో సుభిక్ష పరిపాలన అందుతోందని గృహసారథుల మండల కన్వీనర్, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సచివాలయం–2, 3, 4 సచివాలయాలతో పాటు సజ్జలగుడ్డం, తుంబిగనూరు గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం హాజరైయ్యారు.ఎంపీపీ ఈరన్న, మాజీ ఎంపీపీ భీమక్క, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మంగమ్మ, నాడుగేని నాగరాజు, జగదీష్ స్వామి, ప్రవీణ్‌కుమార్, గానిగవీరస్వామి పాల్గొన్నారు.

కౌతాళం: ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందించడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, వైస్ ఎంపీపీ బుజ్జీస్వామి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మెయిన్‌బజార్, నాల్గవ వార్డులో ఇంటింటికీ తిరిగి ప్రజల అభిప్రాయాల్ని సేకరించారు. సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, నాయకులు భీమేష్, మాజీ ఎంపీటీసీ చౌదరిబసవ, రాజ్ అహ్మద్, రామాంజిని, సమద్ పాల్గొన్నారు.

పోటాపోటీగా ఎడ్ల బండ లాగుడు పోటీలు

సి.బెళగల్: మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో శ్రీ కోన వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అంతర్రాష్ట్ర పాల పళ్ల ఎద్దులు బండలాగుడు పోటీలు పోటాపోటీగా సాగాయి. ఇందులో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ. 30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను దాతలు అందజేశారు. కాగా పోటీల్లో సి.బెళగల్ మండలం ఇనగండ్ల గ్రామంకు చెందిన బోయబాయికాటి బోడెన్న, గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు గ్రామానికి చెందిన సీతారాముడు సంయుక్త ఎద్దుల జత 4,159 అడుగుల దూరం లాగిన మొదటి స్థానంలో నిలవగాచ గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు గ్రామానికి చెందిన చెవిడి సుంకన్న, ఎమ్మిగనూరు మండలం ఏనుగబాల గ్రామానికి చెందిన ఎల్లప్ప సంయుక్త ఎద్దుల జత 4,151 అడుగుల దూరం లాగి రెండవ స్థానం, ఆస్పరి మండలం పలకలదిన్నె గ్రామానికి చెందిన నాగలింగ ఎద్దు 3,500 అడుగుల దూరం లాగి మూడవ స్థానం, నందవరం మండలం కనవీడుపేట గ్రామానికి చెందిన డీలర్ వీరన్న ఎద్దు 2,250 అడుగుల దూరంలాగి నాల్గవ స్థానం దక్కించుకున్నాయి.

పరమ పావనం భగవద్గీత పఠనం

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలని దీంతో పరమ పావనం చెందుతామని ఇస్కాన్ బాధ్యులు వైష్ణోకృప చైతన్య ప్రభుదాస్ అన్నారు. ఆదివారం ఇస్కాన్ జగన్నాథ మందిరంలో శ్రీల ప్రభుపాద విందు కార్యక్రమం జరిగింది. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. అనంతరం భగవద్గీతపై ఆయన ప్రవచనం చెప్పారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఉత్తమ జీవితానికి భగవద్గీత మార్గదర్శనం అన్నారు. హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన చేశారు. అనంతరం జగన్నాథ్‌కు మహారాజభోగ నివేదన చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పుప్పాలదొడ్డిలో సప్త భజన

ఆస్పరి: మండలంలోని కైరుప్పల మజరా గ్రామమైన పుప్పాలదొడ్డి గ్రామంలో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు గిడ్డాంజనేయస్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయాలలో సప్త భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు ఆదివారం తెలిపారు. వర్షాలు బాగా కురిసి, పంటలు పండాలని ఏటా మాదిరిగానే సప్త భజన నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



క్రీస్తు సందేశం వినిపిస్తున్న ఫాదర్



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఆదోని అర్బన్ : పట్టణంలో వెలిసిన ఆయా క్రైస్తవుల చర్చిల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక బాలయేసు కేథలిక్ చర్చిలో హైదరాబాద్ నుంచి వచ్చిన రెవరెండ్ ఫాదర్ అనిల్‌కుమార్, స్థానిక ఫాదర్ కోలా విజయరాజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం క్రీస్తు సందేశాలను వివరించారు.



విద్యుత్ దీపాలంకరణలో కేథలిక్ చర్చి

కోసిగి: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం పునరుత్థాన పండుగను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక క్రీస్తు సంఘం, ఆర్‌సీఎం, సీఎస్ఐ, దలవ్ ఆఫ్ గాడ మినిస్ట్రీ చర్చిల్లో పాస్టర్లు ప్రేమ్‌కుమార్, రామన్న, ఉమేష్, ఫాదర్ జాన్సన్ క్రీస్తు పునరుత్థానం ప్రత్యేకత గురించి వివరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. సిద్దప్ప పాళెం చర్చిలో జరిగిన వేడుకలకు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డి హాజరయ్యారు. పాస్టర్ ప్రేమ్‌కుమార్, సంఘ సభ్యులు ఆయనను సన్మానించారు. అలాగే దలవ్‌ఆఫ్ గాడ్ మినిస్ట్రీ చర్చి అధ్యక్షుడు ఉమేష్ ఆధ్వర్యంలో కోసిగిలో వంద మంది అనాథలకు అన్నదానం చేశారు.



అనాథలకు అన్నదానం చేస్తున్న దృశ్యం

వైభవంగా సాయిబన్నదాదా ఉరుసు



గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

హొళగుంద: స్థానికులతో పాటు కర్ణాటక ప్రజల ఆరాధ్య దేవుడిగా వెలుగొందుతున్న హొళగుంద సాయిబన్న దాదా గంధం, ఉరుసు ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఉరుసుకు తరలి వచ్చిన భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు చేసి మొక్కుబడులను చెల్లించుకున్నారు. సంప్రదాయపద్ధతిలో శనివారం అర్ధరాత్రి మేల్‌మరే వంశీకులకు సంబంధించి మంచద మనే నుంచి గంధాన్ని గుర్రంపై ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తులు దారి పొడువునా కర్రలు, అగ్గి కాగడాలు తిప్పే విన్యాసాలు, బల ప్రదర్శనలు నిర్వహించి అబ్బురపరిచారు. రాత్రి భజన, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ అబ్దుల్‌జహీర్, సిబ్బంది బందోబస్తు చేపట్టారు. సోమవారం జియారత్ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.